క్లుప్తంగా

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి



శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

డోన్ టౌన్: వృత్తి విద్యా కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని మండల విద్యాధికారి–2 రామనర్సప్ప, హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డిఅన్నారు. పట్టణంలోని పాతపేట హైస్కూల్ విద్యార్థులకు సోమవా రం ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లను అందజేశారు. పాఠశాలలో వృత్తి విద్యా కోర్సులు చదివే విద్యార్థులకు పట్టణంలో కంప్యూటర్ కోర్సులు, బైకు మెకానిక్ షాపులు, రేడియం స్టిక్కరింగ్ తదితర రంగాల్లో 80 గంటల ఇంటర్న్‌షిప్ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణ ఇచ్చిన సంస్థ యజమానులు ఫోటాన్ ఇన్‌స్టిట్యూట్ సాయినాథ్, శ్రీసాయి గ్లోబల్ కంప్యూటర్ లక్ష్మణసాయి, జయరామ, కృష్ణ, మురళి, శేషులను సత్కరించారు.

28 నుంచి వీరాయపల్లెలో దేవర



దేవర ఆహ్వాన పత్రికలతో గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముద్దవరం మజార గ్రామమైన వీరాయపల్లెలో ఈనెల 28, 29 తేదీల్లో పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు కాంతారెడ్డి, సూర్యచంద్రారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, తిమ్మారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉత్సవాల ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు.

భక్తిశ్రద్ధలతో ఏకలవ్య ఆరాధనోత్సవాలు



ఏకలవ్యునికి పూజలు చేస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న ఏకలవ్యుని ఆలయంలో సోమవారం ఆరాధనోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏకలవ్యుని విగ్రహానికి అర్చన, అభిషేకం, తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాకి శ్రీనివాసులు,కాకి రామకృష్ణుడు, వెంకటేశ్వర్లు, జయచంద్ర, జయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి అల్లా బకాష్ వలీ ఉరుసు



రంగులతో ముస్తాబైన దర్గా

బేతంచెర్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో అల్లా బకాష్ వలీ ఉరుసు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు దర్గా నిర్వాహకులు లింగమూర్తి, రాజ, ఖాజా హుసేన్ తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని దర్గాను, రంగులు,విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి గంధోత్సవం, బుధవారం ఉరుసు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పా రు.బుధవారం సాయంత్రం ఇసుక సంచి, గుండు, సందరాళ్ల పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు వెండి పతకాలు అందజేస్తామని తెలిపారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ



రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో సోమవారం వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. సబ్ డివిజన్‌లోని ఆరు మండలాలకు సంబంధించి 162 విత్తన, రసాయన ఎరువుల గొర్రులు, గుంటికలు, రోటోవేటర్లు, నాగలి, తైవాన్ స్ప్రేయర్లు, తదితర వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయి. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాల రైతులకు వీటిని అందజేశారు. ఒక్కో మండలానికి రూ. 9 లక్షల సబ్సిడీ అందజేసిందని మంత్రి తెలిపారు. నంద్యాల, కోవెలకుంట్ల ఏడీఏలు సుధాకర్, రాజశేఖర్, కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల ఏఓలు నిరంజన్, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్‌హక్, జ్యోతి, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను మంత్రి తనిఖీ చేశారు. కొందరు అధికారులు, ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేసవి దుక్కులు.. ఎన్నో ఉపయోగాలు

- చీడపీడలు, కలుపు నివారణకు దోహదం
- లోతుగా దున్నితే లాభాలు
- వ్యవసాయాధికారి సూచనలు



కోవెలకుంట్ల: ఏటా జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. మారిన వ్యవసాయ పద్ధతులతో వివిధ పంటల్లో కలుపు నివారించేందుకు రైతులు పలు రకాల కలుపు మందులపై ఆధారపడుతున్నారు. విత్తనం వేశాక, పైరు పెరిగే దశలో కలుపు మందుల వాడకంతో నివారణ చేపడుతున్నారు. అలాకాకుండా వేసవికాలం దుక్కుల నుంచే వ్యవసాయానికి శ్రీకారం చుట్టాలని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. పంటల్లో కలుపు సమస్య దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని.. కలుపు యాజమాన్య ప్రక్రియ వేసవి నుంచే చేపడితే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు.

వేసవిలో యాజమాన్య పద్ధతులు

పొలాల్లో పంట కోతల అనంతరం మిగిలిపోయిన కలుపు మొక్కలు పూర్తిగా నాశనం చేయాలి. శనగ, మిరప, మినుము, పెసర పంటలు కోసిన తర్వాత పొలంలో మిగిలిపోయిన లింగమిరియాలు, ఇతర కలుపు మొక్కలను పీకి నాశనం చేయాలి. చేయలేని పరిస్థితుల్లో లీటరు నీటికి 2 గ్రాముల ఫెర్నాక్సోన్ లేదా 2 ఎంఎల్ వీడ్‌మార్ సూపర్‌ను కలిపి పిచికారీ చేస్తే పొలంలో మిగిలిపోయిన లింగమిరియాల కలుపును నివారించవచ్చు. ఈ కలుపుతోపాటు ఇతర కలుపు మొక్కలు ఉన్నప్పుడు లీటరు నీటికి 5 ఎంఎల్ పారాక్వాట్ లేదా 10 ఎంఎల్ గ్లైసిల్‌తోపాటు పది గ్రాముల యూరియా లేక 4 గ్రాముల ఎక్సెల్ మీరా కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మినుము, పెసర సాగు చేసిన పొలంలో పంట కోత తర్వాత పొలంలో మిగిలిపోయిన పరాన్నజీవి అయిన బంగారు తీగ కలుపు నివారణకు పారాక్వాట్ లేదా గ్లైసైల్ పిచికారి చేసి నివారించవచ్చు.

ఇతర కలుపుమొక్కల నివారణ

పొలంలో మొండిజాతి కలుపే కాకుండా ఇతర కలుపు జాతులైన ఊద, చిప్పెర, ఉర్రంకి, గలిజేరు, నేలఉసిరి, పొన్నగంటికూర వంటి కలుపు మొక్కలు ఉన్నప్పుడు 8–9 అంగులాలపైబడి లోతుదుక్కి దున్నితే ఈ కలుపుజాతి మొక్కలు నశిస్తాయి. నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు పంట కోసిన వెంటనే లేదా మే నెలలో వేసవి జల్లులు పడినప్పుడు తప్పనిసరిగా వేసవి దుక్కులు దున్నుకుని కలుపు సమస్యను నివారించవచ్చు. సాగులో ఉన్న పొలాల్లోనే కాక పొలం గట్లు, పొలానికి వెళ్లే డొంకలు, పొలం పక్కన ఖాళీ ప్రదేశాలు, కాలవ, చెరువుగట్లపై పెరిగే కలుపు మొక్కలపై దృష్టి సారించాలి. పెరాక్వాట్, గ్లైసిల్ వంటి కలుపు మందులను సిఫారసు మేరకు వినియోగించి పెరిగే కలుపు మొక్కలను నివారించడంతోపాటు కలుపుమొక్కల విత్తనోత్పత్తిని అరికట్టవచ్చు.

చదునుగా లేని పొలాల్లో కలుపు సమస్య అధికం

నేల చదునుగా లేని పొలాల్లో పంటలు సాగు చేసినప్పుడు కలుపు సమస్య అధికంగా ఉంటుంది. వేసవికాలంలో పనులు తక్కువగా ఉన్నందున నేలను చదును చేసుకునే అవకాశం ఉంటుంది. ఎక్కువ హెచ్‌పీ ట్రాక్టర్‌తో నడిచే లేజర్ లెవెలర్ నేల చదునుకు అనుకూలం. వీటిని ఉపయోగించి ఏడాది లేదా రెండేళ్లకోసారి నేలను చదును చేసుకుంటే కలుపు సమస్య తగ్గడమేకాకుండా పంటసాగుకు అనుకూలంగా ఉంటుంది. లోతు దుక్కులు, నేలను చదును చేసే పనులే కాకుండా వేసవిలో వచ్చే జల్లులు, తొలకరి వర్షాలను ఉపయోగించుకుని నేలను అవసరాన్ని బట్టి 3–4 సార్లు దున్నినప్పుడు నేల పైపొరలలోని కలుపు విత్తనాలు చాలావరకు మొలక దశలోనే అంతరించి పంటతోపాటు వచ్చే కలుపు మొక్కలు చాలా వరకు తగ్గిపోతాయి. ఆరుతడి పంటగా వరి సాగుచేసినప్పుడు, పత్తి, మిరప, తదితర పంటల సాగుకు ముందే వేసవిలో లోతుదుక్కులు దున్నుకోవాలి. అధిక ఆదాయ పంటలైన పూలతోటలు, కూరగాయలు, పండ్ల తోటలు, మిరప సాగు చేసే నేలలో వేసవిలో నేలను పాలిథీన్‌షీటుతో కప్పి ఉంచితే నేలపై పొరలలో ఉష్ణోగ్రతలు పెరిగి కలుపు విత్తనాలు మొలక సామర్థ్యం కోల్పోయి కలుపు సమస్య చాలా వరకు తగ్గిపోతుంది.

సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం		
మండలం	సాధారణ విస్తీర్ణం(హెక్టార్లలో)	రైతుల సంఖ్య
సంజామల	4591	10,021
అవుకు	4699	10,071
కోవెలకుంట్ల	1767	7,350
కొలిమిగుండ్ల	2558	7,465
ఉయ్యాలవాడ	2675	6,807
దొర్నిపాడు	3528	5,258

ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో సాగు



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నాలుగు ఎకరాల్లో పంటలు సాగుచేయాలనుకుంటున్నాను. ఎండకు భూమి గట్టి పడి సేద్యం చేసేందుకు వీలు కావడం లేదు. భారీ వర్షం కురిస్తే భూమి దున్నడం సులువు అవుతుంది. రెండు ఎకరాల్లో బెండ, మరో రెండు ఎకరాల్లో మినుము పంట వేసేందుకు వనరులు సమకూర్చుకుంటున్నాను.

–వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల

సాగులో వ్యవసాయాధికారుల సలహాలు అవసరం



వ్యవసాయ రంగంలో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందజేయాలి. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఒక టిన్నర ఎకరాల్లో వరి, రబీలో 30 ఎకరాల్లో శనగ పంట సాగు చేయాలనుకుంటున్నాను. రెండు సంవత్సరాల నుంచి మిరప సాగుతో నష్టం వస్తుండడంతో ఈ ఏడాది మిరప సాగుపై ఆసక్తి చూపడం లేదు.

– రఘునాథరెడ్డి, రైతు, గుళ్లదూర్తి, కోవెలకుంట్ల

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులే ఆరోగ్యకరం



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్యాపిలి: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధించిన ఉత్పత్తులే ఆరోగ్యకరమని తహసీల్దార్ భారతి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం స్టాల్స్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. రసాయనిక ఎరువుల ద్వారా పండించిన పంటలు ఆరోగ్యానికి మంచివి కావన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తినడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు సంతోష్, అభిషేక్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

డోన్: తొమ్మిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన బాలిక ఈ నెల 20వ తేదీ సాయంత్రం పిండి మిషన్‌కు వెళ్లగా యజమాని బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బేతంచెర్ల: ప్రజా సంక్షేమంతో పాటు రైతులు, పొదుపు మహిళల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో రైతు పరివార కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతుపరివార కేంద్రం మార్టు ఎండీ సాయిజోష్ణ, చైర్మన్ అంజయ్య, సీఈఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.

పరీక్షలు, మార్కులే జీవితం కాదు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న శ్రీరామ్

ప్యాపిలి: పరీక్షలు, మార్కులు మాత్రమే జీవితం కాదని జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ శ్రీరామ్ అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. జీసీడీఓ నాగసువర్చ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీరామ్ మాట్లాడారు. ఏపీజే అబ్దుల్ కలాం, మార్క్ జూకర్‌బర్గ్, సచిన్ టెండూల్కర్, కమలహాసన్, మహేంద్రసింగ్ ధోని, విరాట్ కోహ్లి తదితరుల్లో కొందరు పాఠశాల స్థాయిలోనే చదువులు మానేశారని తెలిపారు. మరి కొందరు పరీక్షల్లో ర్యాంకులు సాధించలేక వెనుకబడ్డారని తెలిపారు. అయినా చదువే జీవితం కాదని గుర్తించి వివిధ రంగాల్లో కష్టపడి అత్యున్నత స్థాయికి ఎదిగారన్నారు. పరీక్షల్లో ఫెయిలైనా మళ్లీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావచ్చన్నారు. తమకు నచ్చిన రంగంలో స్థిరపడి అద్భుతాలు సాధించవచ్చన్నారు. పరీక్షల్లో ఫెయిలయ్యామని కుంగిపోకూడదన్నారు. మరో రెండు రోజుల్లో రానున్న పదోతరగతి పరీక్షల్లో ఫలితాలు ఎలా వచ్చినా విద్యార్థులు ఆత్మస్థైర్యంతోనే ఉండాలన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ప్రియాంక పాల్గొన్నారు.

డోన్ టౌన్: సృజనాత్మకత, నైపుణ్యం, తపన, ఆత్మవిశ్వాసం ఉంటే జీవితంలో గొప్ప విజయాలను అందుకోవచ్చని జిల్లా కెరీర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ శ్రీరామ్ అన్నారు. త్వరలో 10వ తరగతి పరీక్ష ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో స్థానిక కస్తూరీ గాంధీ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆత్మస్థైర్యం నింపే కార్యక్రమాన్ని చేపట్టారు. పరీక్షలు, మార్కులు, అభ్యసన కేవలం సామర్థ్యాల పరిశీలనకే పరిమితం అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఇతరులతో పోల్చడం, తక్కువ మార్కులు వచ్చాయని చులకనగా చూడడం సరికాదని తెలిపారు. పిల్లల ఇష్టాలు, అభిరుచులను గుర్తించి వారి ప్రోత్సహించాలని సూచించారు. ప్రిన్సిపాల్ జోషిహెలెన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన మహిళలు

డోన్: స్థానిక జాడీల ఫ్యాక్టరీలోని శేషారెడ్డి స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు మూడు నెలల కుట్టు శిక్షణ శిబిరం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ పథకం ద్వారా మూడు నెలల పాటు శిక్షణ పొందనున్న 144 మంది మహిళలకు కుట్టు మిషన్లను కూడా ఉచితంగా అందజేస్తారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి 144 మంది చొప్పున శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి తెలిపారు.

నవధాన్యాలతో ఎంతో మేలు

బనగానపల్లె: నవధాన్యాల వల్ల ఎంతో మేలు జరుగుతుందని..రైతులు వాటిని గుర్తించి వ్యవసాయాన్ని అభసాటిగా మార్చుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని పాదుపు భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజాభాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేవీకే సహకారంతో రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు. నవ ధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం సేంద్రియ వ్యవసాయానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నంద్యాల డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రరెడ్డి, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అబ్దుల్ సలాం, ఎన్ఎఫ్ఏ రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు 27 మంది గైర్హాజరు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశ పరీక్షను సోమవారం నిర్వహించారు. మొత్తం 137 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 110 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యా రు.27 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ మర్యా దాసు తెలిపారు.

కొలిమిగుండ్లలో 11 మంది గైర్హాజరు

కొలిమిగుండ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశం కోసం సోమవారం స్థానిక మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 130 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 119 మంది హాజరయ్యారు. 11 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు. పది రోజుల్లో ఫలితాలు వస్తాయన్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

అందరి భాగస్వామ్యంతోనే పాఠశాలల అభివృద్ధి



పాఠశాలలో ప్రధాన ద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్యాపిలి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్థానికులు భాగస్వామ్యం కావాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సీతమ్మతండా గిరిజన ఆశ్రమ పాఠశాలలో ట్రెజరీ ఉద్యోగి లక్ష్మణ్ నాయక్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ప్రధాన గేటు, స్టేజీని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానికులను భాగస్వామ్యం చేయాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కాగా పాఠశాలకు మైక్ సెట్ విరాళంగా ఇవ్వనున్నట్లు అలేబాదు పరమేశ్ తెలిపారు. ఎంఈఓ వెంకటేష్ నాయక్, ఈఓఆర్డీ బాలకృష్ణుడు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ప్రభాకర్ రెడ్డి, మనోహర్, హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లెలో విషాదం



నరసింహులు(ఫైల్)

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్లలో పదిహేను రోజుల వ్యవధిలోనే తండ్రి, కుమారుడు మృతి చెందడంతో అంకిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో విషాదం అలుముకుంది. ఈ నెల 5వ తేదీ సర్పంచ్ నాగన్న గుండెపోటుతో మృతి చెందారు. నాలుగు రోజుల క్రితమే ఖర్మకాండలు పూర్తయ్యాయి. కుటుంబం విషాదం నుంచి కోలుకోక ముందే సర్పంచ్ చిన్న కుమారుడు నరసింహులు(35)అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. తండ్రి మృతితో తీవ్ర వేదనకు లోనయ్యాడు. తెల్లవారుజామున కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.

జేఈఈలో 566వ ర్యాంకు



నాగధరనీష్‌రెడ్డి

బనగానపల్లె రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన విద్యార్థి అల్లె నాగధరనీష్‌రెడ్డి ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 566వ ర్యాంకు సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన అల్లె సుదర్శన్‌రెడ్డి, అమృతదేవి దంపతుల కుమారుడు నాగధరనీష్‌రెడ్డి 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు హైదరాబాద్‌లో విద్య అభ్యసించాడు. జేఈఈ అడ్వాన్స్‌లో మంచి మార్కులు తెచ్చుకుని ఐఐటీ సీఎస్ఈ బ్రాంచ్‌లో సీటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు నాగధరనీష్‌రెడ్డి తెలిపారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామిఆలయంలో సోమవా రం సాయంత్రం స్వామివారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకుల ఆధ్వర్యంలో ఉదయం ఉమామహేశ్వరునికి అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ బండి మాలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని కేజీబీవీలో చదువుతూ ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అబీదా బేగం , ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రథమ సంవత్సరం సీఈసీలో 468 మార్కులు సాధించిన రాణి, ద్వితీయ సంవత్సరంలో 925 మార్కులు సాధించిన నీలావతిని విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో అభినందించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మాజీ కౌన్సిలర్ గోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుగ్గన

డోన్: వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా పనిచేస్తూ మృత్యువాతపడ్డ కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని త్రివర్ణ కాలనీకి చెందిన పార్టీ నేత, మాజీ కౌన్సిలర్ మంగమూరి గోపాల్, డాక్టర్ సుందర్‌సింగ్ కాలనీకి చెందిన పార్టీ నాయకులు బోయ ఎర్రమల ఇటీవల మృతిచెందారు. సోమవారం బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, జిల్లా వలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ఉపాధ్యక్షులు కురుకుంద హరి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

బనగానపల్లె రూరల్: మండలంలోని పలువురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం తెలిపారు. ఈ నెల 19వ తేదీ స్వర్ణాంధ్రా–స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 19 మంది ఉద్యోగులు విధులకు హాజరుకాలేదు. ఇందులో జాతీయ ఉపాధి హామీ ఏపీఓ ప్రతాప్, ఎంఈఓ–1లు స్వరూప, శ్రీనివాసులు, ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, గ్రామ సచివాలయం–1లో సర్వేయర్ సంగీత మధురి, ఎనర్జీ అసిస్టెంట్ వెంకటేష్‌యాదవ్, డిజిటల్ అసిస్టెంట్ రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ శాంతి కుమారి, సచివాలయం–2లో సర్వేయర్ సంధ్యా అర్చన, ఏఎన్ఎం మల్లేశ్వరి, వీఆర్ఓ కుళ్లాయి, ఎనర్జీ అసిస్టెంట్ నాగేంద్ర, సచివాలయం–3లో విధులు నిర్వహించే ఏఎన్ఎం నాగేశ్వరమ్మ, డిజిటల్ అసిస్టెంట్ మహేశ్వరమ్మ, సచివాలయం–4లో ఎనర్జీ అసిస్టెంట్ ప్రవీణ్, సచివాలయం–5లో మహిళా పోలీసు పుష్పలత, ఎనర్జీ అసిస్టెంట్ శ్రీకాంత్, హుస్సేన్‌బాషా, డిజిటల్ అసిస్టెంట్ తిలక్‌కు మంత్రి ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు వెల్లడించారు. రెండు రోజుల్లో సంజాయిషీని రాతపూర్వకంగా తెలియజేయాలని నోటీసుల్లో పేర్కొన్నారు.



కలుగొట్ల సమీపంలో సాగైన నువ్వుల పంట

నువ్వులు.. ఆశలు

కోవెలకుంట్ల సబ్ డివిజన్‌లో ఈ ఏడాది నువ్వుల సాగు రైతులను ఆశలు రేకెత్తిస్తోంది. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల పరిధిలో ఎండకారు పంటగా సాగు చేశారు. కుందూనది, కుందర, పాలేరు, ఎస్సార్బీసీ, తదితర సాగునీటి వనరుల ఆధారంగా 100 రోజుల పంటకాలం కలిగిన నువ్వుల పంట ఆశాజనకంగా ఉండడంతో దిగుబడులు ఊరిస్తున్నాయి. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 5 వేలు వెచ్చించారు. వాతావరణం అనుకూలంగా మారడంతో ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులంటున్నారు. మార్కెట్‌లో క్వింటా రూ. 8 వేల నుంచి రూ.10 వేలు ధర ఉండడంతో ఆశగా ఉన్నారు.

–కోవెలకుంట్ల

సారా స్థావరంపై దాడి.. బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

అవుకు: మండల పరిధిలోని పిక్కర్లపల్లి తండాలో ఎక్సైజ్ పోలీసులు సోమవారం నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. బనగానపల్లె ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి వివరాల మేరకు.. పిక్కర్లపల్లి తండాలో నాటుసారా తయారీ జరుగుతోందని సమాచారం అందడంతో దాడులు చేశామని తెలిపారు. ఇందులో సారా తయారీ కోసం ఉంచిన 2 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. కాట్రవత్ నానికే నాయక్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన పిక్కిలి చిన్నయ్య నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.